# ప్రజా మనిషి
## తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 259 పేజీలు : 04 వెల రూ. 2 శనివారం 18 - 04 - 2026



**మహిళా రిజర్వేషన్ చట్టం, డీలిమిటేషన్ బిల్లుకు బ్రేక్... లోక్ సభలో వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు**

## రాజధాని పరిధిలో పురుషుల కంటే
# మహిళలే ఎక్కువ

- టాప్‌లో రంగారెడ్డి
- లింగ నిష్పత్తిలో రంగారెడ్డి జిల్లాదే అగ్రస్థానం
- మూడు జిల్లాల్లో మహిళల సంఖ్యే ఎక్కువ
- స్పష్టం చేసిన సామాజిక ఆర్థిక కుల సర్వే నివేదిక
- మేడ్చల్-మల్కాజిగిరిలో సగటు లింగ నిష్పత్తి 1066
- సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ఆధారంగా గణాంకాలు
- మహానగరం హైదరాబాద్‌లో నెలకు కేవలం రూ.5 వేలలోపు సంపాదనతో సగటున 9 శాతం మంది జీవనం
- వైద్య చికిత్సల కోసం పేదలు రుణాలు తెచ్చి మరీ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు



**హైదరాబాద్ :**

తెలంగాణలో నగర, పట్టణ జనాభాలో లింగ నిష్పత్తి చాలా ముందంజలో ఉంది. గతేడాది తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ఆధారంగా తాజాగా విడుదలైన తెలంగాణ అర్బన్ డెమోగ్రాఫిక్ టేబుల్స్ (2024) గణాంకాల ప్రకారం రాజధాని పరిధిలోని జిల్లాల్లో పురుషుల కంటే మహిళల సంఖ్య ఎక్కువగా ఉండటం ఇక్కడ విశేషం. జీహెచ్ఎంసీ, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో సామాజిక వర్గాల వారీగా లింగ నిష్పత్తిలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం మెరుగైన ఆరోగ్య సౌకర్యాలు, ప్రజల్లో అవగాహన, మారుతున్న సామాజిక దృక్పథానికి ఈ ఫలితాలే నిదర్శనమని నిపుణులు పేర్కొంటున్నారు.

**జీహెచ్ఎంసీలో :** జీహెచ్ఎంసీ పరిధిలో లింగనిష్పత్తి 1078గా ఉంది. అంటే ఇక్కడ ప్రతి 1000 మంది పురుషులకు 1078 - మిగతా 2 లో

## రాష్ట్రానికి రావాల్సిన
# పెండింగ్ నిధులపై చర్చ



- ధాన్యం సేకరణ కోసం కేంద్రమంత్రిని కలిసిన సీఎం రేవంత్ రెడ్డి
- కేంద్రమంత్రి జోషితో రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ
- 30 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ ధాన్యం సేకరించాలని విజ్ఞప్తి
- రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులపై చర్చ

**హైదరాబాద్ :**

కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. వానాకాలం యాసంగి పంటకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ ధాన్యం సేకరించాలని వారు కేంద్రమంత్రిని కోరారు. 2025-26 సీజన్ కు గాను యాసంగి పంట - మిగతా 2 లో




## దక్షిణాదికి అన్యాయం జరగదు..

- రేవంత్ ఫార్ములా వెనుక అసదుద్దీన్: కిషన్ రెడ్డి
- డీలిమిటేషన్ విషయంపై ప్రజలను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తప్పుదోవ పట్టిస్తున్నాయన్న కిషన్ రెడ్డి
- జనాభా ప్రాతిపదికన సీట్ల విభజన జరిగినా దక్షిణాది ప్రాధాన్యత తగ్గబోదని వెల్లడి
- హైబ్రిడ్ ఫార్ములాను రేవంత్ చేత ఒవైసీ చెప్పించారని విమర్శ

# పాస్టర్ ఇంట్లో కట్టల కొద్దీ నోట్లు..

- రూ. 2.27 కోట్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో ఓ చర్చి పాస్టర్ ఇంట్లో భారీ నగదు పట్టివేత
- సోదాల్లో ఎలాంటి ఆధారాలు లేని రూ. 2.27 కోట్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు
- ఇది హవాలాకు సంబంధించిన డబ్బుగా అనుమానిస్తున్న అధికారులు
- డబ్బు ఎక్కడిదో చెప్పలేక తడబడిన పాస్టర్ కుటుంబం



**నరసాపురం :**

పశ్చిమ గోదావరి జిల్లాలో ఓ చర్చి పాస్టర్ ఇంట్లో భారీగా నోట్ల కట్టలు బయటపడటం కలకలం రేపింది. నరసాపురం మండలం పీచుపాలెంకు చెందిన పాస్టర్ ఘంటా జాన్‌బాబూరావు నివాసంలో పోలీసులు సోదాలు నిర్వహించి, ఎలాంటి ఆధారాలు లేని రూ. 2.27 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు ఈ డబ్బును సీజ్ చేసి, ఆదాయపు పన్ను శాఖకు సమాచారం అందించారు.ఇటీవల పాస్టర్ అల్లుడు శాంసన్ హైదరాబాద్ నుంచి రూ. 50 లక్షల నగదు తీసుకురావడంతో పోలీసులు నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆయన మామగారైన జాన్‌బాబూరావు ఇంట్లో తనిఖీలు చేపట్టగా, రూ. 500 నోట్ల కట్టల రూపంలో దాచి ఉంచిన ఈ భారీ మొత్తం బయటపడింది. - మిగతా 2 లో

# మహిళా రిజర్వేషన్ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించాలి

- ఎంపీలకు ప్రధాని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు
- మీ ఆత్మ ప్రబోధానుసారం నడుచుకోండి
- పార్లమెంటు సభ్యులకు ప్రధాని మోదీ పిలుపు
- లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బిల్లు
- ఇది యుగాలుగా మహిళలకు నిరాకరించిన హక్కు అని, వారికి న్యాయం చేయాలని వ్యాఖ్య
- డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని ప్రధాని హామీ



**అమరావతి :**

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ భావోద్వేగంగా ప్రసంగించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే ఈ చరిత్రాత్మక బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించి చరిత్ర సృష్టించాలని ఆయన పార్లమెంటు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఇది దేశంలోని సగం జనాభా అయిన మహిళలకు దక్కాల్సిన హక్కు అని, వారి శక్తికి కొత్త అవకాశాలు కల్పించాలని కోరారు.లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే 'నారీ శక్తి వందన్ అధినియమ్' అమలు కోసం ప్రభుత్వం ఈ ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తోంది. ఈ బిల్లును 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి అమలు చేయడమే - మిగతా 2 లో

# తల్లిని, చెల్లిని గెంటేసిన వ్యక్తి మహిళా పక్షపాతి అవుతారా?

- జగన్ పై గౌతు శిరీష ఫైర్
- మహిళా రిజర్వేషన్ బిల్లుపై వైసీపీ నేతల విమర్శలు హాస్యాస్పదమన్న గౌతు శిరీష
- ఆస్తి కోసం తల్లిని, చెల్లిని బయటకు గెంటేసిన జగన్ మహిళా పక్షపాతి కాదని విమర్శలు
- వివేకా హత్య కేసులో అవినాష్ రెడ్డిని జగన్ ప్రభుత్వం కాపాడిందని ఆరోపణ
- అమరావతి మహిళలను వేధించిన చరిత్ర వైసీపీది అంటూ ఆగ్రహం




**అమరావతి :**

వైసీపీ నేతలు ఇప్పటివరకు విలన్లు అనుకుంటే, ఇప్పుడు వారు చేస్తున్న విమర్శలతో ఉత్త జోకర్లుగా నిరూపించుకుంటున్నారని టీడీపీ ఎమ్మెల్యే గౌతు శిరీష వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా మహిళా రిజర్వేషన్ బిల్లుపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతుంటే, ఏపీలోని వైసీపీ నేతలు మాత్రం విషం చిమ్ముతున్నారని ఆమె మండిపడ్డారు. తల్లిని, చెల్లిని గెంటేసిన వ్యక్తి మహిళా పక్షపాతి అవుతారా? అంటూ జగన్ పై ధ్వజమెత్తారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జగన్ పాలనలో మహిళలపై అనేక అకృత్యాలు జరిగాయంటూ నిప్పులు చెరిగారు."మాజీ మంత్రి - మిగతా 2 లో

## ప్రపంచ దేశాలకు ఇరాన్ శుభవార్త
## హర్మ్యూజ్ ను పూర్తిగా తెరిచామంటూ ప్రకటన

- హర్మ్యూజ్ జలసంధిని వాణిజ్య నౌకల కోసం తెరిచినట్లు ప్రకటించిన ఇరాన్
- లెబనాన్‌లో కాల్పుల విరమణ కొనసాగినంత కాలం ఈ నిర్ణయం అమలు
- నిర్ణీత మార్గంలోనే నౌకలు ప్రయాణించాలని స్పష్టం చేసిన ఇరాన్




# మహిళా బిల్లుకు టీడీపీ సంపూర్ణ మద్దతు




- ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు
- చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడం అనేది కేవలం ఒక బిల్లు కాదన్న లావు
- కోట్లాది మంది మహిళల ఆకాంక్షలకు దక్కిన గౌరవమని వ్యాఖ్య
- డీలిమిటేషన్ వల్ల రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య నిష్పత్తిలో మార్పు ఉండబోదన్న లావు

## రానున్నది మరింత
# కఠిన వేసవి

- హెచ్చరిస్తున్న వాతావరణ నిపుణులు
- రాష్ట్రంలో భగ్గుమంటున్న ఎండలు
- పలుచోట్ల 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- నంద్యాల జిల్లా సంజామలలో అత్యధికంగా 45.1 డిగ్రీల నమోదు
- ఈ ఏడాది వేసవి మరింత తీవ్రంగా ఉంటుందని నిపుణుల హెచ్చరిక
- బలహీనపడిన తూర్పు గాలులే వేడికి కారణమని విశ్లేషణ
- పలు జిల్లాలకు తీవ్ర వడగాల్పుల హెచ్చరికలు జారీ




**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్‌ను తీవ్రమైన ఎండలు, వడగాల్పులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుకుంటున్నాయి. గురువారం ఒక్కరోజే నంద్యాల జిల్లా సంజామలలో అత్యధికంగా 45.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే మే, జూన్ నెలల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయని, - మిగతా 2 లో

# సంపాదకీయం

## నేటి బాధ్యతగల బాల్యం
## రేపటి నాగరిక సమాజానికి బలమైన పునాది



**"నేటి బాలలే రేపటి పౌరులు"**

ఈ మాట ఎంత నిజమో, ఆ పౌరులను ఎలా తీర్చిదిద్దుతున్నామన్నది అంతే ముఖ్యం. సమాజం పట్ల గౌరవం, తోటి వారి పట్ల బాధ్యత అనేది పుస్తకాల్లో చదివి నేర్చుకునేది కాదు, అది ఆచరణ ద్వారా అలవడాల్సిన గుణం. బాల్యంలోనే వారికి సామాజిక బాధ్యత అనే గొప్ప విలువను అలవాటు చేయడం అత్యంత అవసరం. సామాజిక స్పృహను పెంపొందించడం దేశాభివృద్ధికి మొదటి మెట్టు. చిన్ననాటి అలవాట్లు, విలువలే నాగరిక సమాజ నిర్మాణానికి బలమైన మూలస్తంభాలుగా మారుతాయి. ప్రస్తుతం మన సమాజంలో కనిపిస్తున్న అనేక సమస్యలకు మూలం చిన్ననాటి అలవాట్ల లోపం, బాధ్యత రాహిత్యం. ట్రాఫిక్ నియమాల పట్ల నిర్లక్ష్యం, ప్రజా ప్రదేశాల అపరిశుభ్రత, పరస్పర గౌరవం తగ్గిపోవడం ఇంకా అనేక అంశాల పట్ల చిన్నప్పటి నుంచే అలవాటు చేసే సామాజిక క్రమశిక్షణే రేపటి సమాజ సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారం. ఇంటి వాతావరణమే పిల్లలకు తొలి పాఠశాల. తల్లిదండ్రుల ప్రవర్తన, మాటతీరు, క్రమశిక్షణ పిల్లలపై శాశ్వత ముద్ర వేస్తాయి. పెద్దలతో గౌరవంగా మాట్లాడడం, చిన్నవారితో ప్రేమగా మెలగడం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం, ఇంటి పనుల్లో తమ వంతు బాధ్యత తీసుకోవడం వంటి అలవాట్లు వారికి స్వయం బాధ్యతతో పాటు సామాజిక స్పృహను కూడా పెంపొందిస్తాయి. ఈరోజు చిన్నారుల మనసుల్లో నాటిన అలవాట్లే రేపటి సమాజపు స్వరూపాన్ని నిర్ణయిస్తాయి. ఈ విషయాన్నీ గ్రహించి పాఠశాలలు ఈ బాధ్యతను మరింత విస్తరించాలి. పుస్తకాల జ్ఞానంతో పాటు పౌర విలువలు, సామాజిక నైతికత, ప్రజా జీవన శైలి కూడా బోధనలో భాగం కావాలి. బస్సు స్టాండ్, రైల్వే స్టేషన్, దేవాలయం, ఆసుపత్రి వంటి ప్రజా ప్రదేశాల్లో క్యూ పద్ధతి పాటించడం, ట్రాఫిక్ నియమాలను గౌరవించడం, రోడ్డు భద్రతను అలవాటు చేయడం, ప్రజా ప్రదేశాల్లో చెత్త వేయకుండా ఉండడం, ఎక్కడపడితే అక్కడ ఉమ్మివేయకపోవడం, నీరు, విద్యుత్ వృథా చేయకపోవడం, మొక్కలను సంరక్షించడం వంటి ప్రాథమిక అలవాట్లు విద్యార్థుల జీవితంలో ఒక భాగంగా పటిష్టం కావాలి. పిల్లలకు వారసత్వంగా ఆస్తులు ఇవ్వడం కంటే సామాజిక బాధ్యత, విలువలు, క్రమశిక్షణ అనే జీవన సంపదను అందించడం గొప్పది. అదే భవిష్యత్తులో బాధ్యత గల పౌరులను, శాంతియుత సమాజాన్ని, అభివృద్ధి చెందిన దేశాన్ని నిర్మిస్తుంది. బాల్యంలో మీరు నాటిన బాధ్యత విత్తనమేడ రేపటి సమాజానికి మహావృక్షం అవుతుంది, కల్పవృక్షంగా మారుతుంది.

వై. సంజీవ కుమార్,
ఫౌండర్ & ప్రెసిడెంట్,
స్కై ఫౌండేషన్,
9393613555,9493613555.



## యూరప్ పర్యటనకు జగన్‌కు గ్రీన్ సిగ్నల్

**మొదటిపేజీ తరువాయి** – వైసీపీ అధినేత జగన్ మరోసారి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. తన కుటుంబ సభ్యులతో కలిసి యూకేతో పాటు యూరప్‌లోని పలు దేశాలను సందర్శించేందుకు అనుమతి కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం సానుకూలంగా స్పందించింది. ఈ నెల 20వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు, అంటే మొత్తం 25 రోజుల పాటు విదేశాల్లో గడిపేందుకు కోర్టు ఆయనకు అనుమతి మంజూరు చేసింది. అక్రమాస్తుల కేసు విచారణలో ఉన్న నేపథ్యంలో, విదేశీ ప్రయాణాలకు కోర్టు అనుమతి తప్పనిసరి కావడంతో జగన్ ఈ పిటిషన్ దాఖలు చేశారు.అయితే, ఈ విదేశీ పర్యటనకు సంబంధించి న్యాయస్థానం కొన్ని కఠినమైన షరతులను విధించింది. ప్రయాణానికి ముందే తన పూర్తి పర్యటన వివరాలు, కాంటాక్ట్ నెంబర్లు, ఈ-మెయిల్ ఐడీ, అవసరమైన ష్యూరిటీ వివరాలను సీబీఐ అధికారులకు సమర్పించాలని ఆదేశించింది. ప్రస్తుతం ఏపీలో రాజకీయ సమీకరణాలు మారుతున్న తరుణంలో, జగన్ సుమారు మూడు వారాల పాటు విదేశీ పర్యటనకు వెళుతుండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. కుటుంబ సభ్యులతో కలిసి వ్యక్తిగత పర్యటన ముగించుకున్నాక, మే మధ్యలో ఆయన తిరిగి రాష్ట్రానికి చేరుకోనున్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించాలి

**మొదటిపేజీ తరువాయి** – లక్ష్యంగా అవసరమైన రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. భవిష్యత్తులో జనాభా గణన, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) తర్వాత ఈ రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి.ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, "దయచేసి మీ మనస్సాక్షి చెప్పినట్టు నడుచుకోండి. మీ కుటుంబంలోని మహిళలను గుర్తుచేసుకోండి. ఇది మహిళలకు మనం ఇస్తున్నాం అనుకోకండి... యుగాలుగా వారికి నిరాకరించబడిన హక్కును తిరిగి ఇవ్వడం మన బాధ్యత అని గుర్తించండి" అని పేర్కొన్నారు. ఈ బిల్లు ఆమోదం ఘనతను ప్రతిపక్షాలే తీసుకోవచ్చని, తనకు క్రెడిట్ అవసరం లేదని స్పష్టం చేశారు.డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని ప్రధాని స్పష్టమైన హామీ ఇచ్చారు. ప్రస్తుతం లోక్‌సభలో ఈ బిల్లులపై చర్చ కొనసాగుతుండగా, శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగే అవకాశం ఉంది. ఈ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందితే దేశ ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని ప్రధాని పేర్కొన్నారు.

## పాస్టర్ ఇంట్లో కట్టల కొద్దీ నోట్లు..

**మొదటిపేజీ తరువాయి** – ఇది హవాలా లావాదేవీలకు సంబంధించిన డబ్బు అయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.ఒక పాస్టర్ ఇంట్లో ఇంత పెద్ద మొత్తంలో నగదు దొరకడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇటీవల కాలంలో బాబూరావు కుటుంబం పెద్ద ఎత్తున ఆస్తులు కొనుగోలు చేసినట్లు, లక్షల్లో ఖర్చు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. పట్టుబడిన డబ్బు గురించి పోలీసులు ప్రశ్నించగా, కుటుంబ సభ్యులు పొంతనలేని సమాధానాలు చెప్పినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ డబ్బు మూలాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రపంచ దేశాలకు ఇరాన్ శుభవార్త
## హర్మూజ్ ను పూర్తిగా తెరిచామంటూ ప్రకటన

**మొదటిపేజీ తరువాయి** – ఇటీవల కాలంలో చమురు, ఎల్పీజీ సంక్షోభంలో అల్లాడిపోతున్న ప్రపంచ దేశాలకు ఇరాన్ తియ్యని కబురు వినిపించింది. అంతర్జాతీయ వాణిజ్యానికి కీలకమైన హార్ముజ్ జలసంధి విషయంలో ఇరాన్ కీలక ప్రకటన చేసింది. హర్మూజ్ ను పూర్తిగా తెరిచినట్టు వెల్లడించింది. లెబనాన్‌లో అమలవుతున్న కాల్పుల విరమణ కొనసాగినంత కాలం, ఈ జలసంధి గుండా అన్ని రకాల వాణిజ్య నౌకల రాకపోకలకు అనుమతి ఇస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ విషయాన్ని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి శుక్రవారం అధికారికంగా వెల్లడించారు."లెబనాన్‌లో కాల్పుల విరమణ ఒప్పందానికి అనుగుణంగా, ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ పోర్ట్స్ అండ్ మారిటైమ్ ఆర్గనైజేషన్ ఇప్పటికే ప్రకటించిన సమన్వయ మార్గంలో, మిగిలిన కాల్పుల విరమణ కాలానికి హర్మూజ్ జలసంధి గుండా అన్ని వాణిజ్య నౌకల ప్రయాణానికి మార్గం పూర్తిగా తెరిచి ఉంటుంది" అని మంత్రి తన ప్రకటనలో పేర్కొన్నారు.అంతర్జాతీయ చమురు వాణిజ్యంలో హర్మూజ్ జలసంధి అత్యంత వ్యూహాత్మకమైనది. ఇటీవలి కాలంలో ఈ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ తాజా నిర్ణయం వాణిజ్య వర్గాలకు ఊరటనిస్తోంది. అయితే, నౌకలు తమ దేశ మారిటైమ్ సంస్థ నిర్దేశించిన మార్గంలోనే ప్రయాణించాలనే షరతును ఇరాన్ విధించింది. లెబనాన్‌లో శాంతియుత వాతావరణం కొనసాగేలా చూసే చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులపై చర్చ

**మొదటిపేజీ తరువాయి** – 90 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని కేంద్రమంత్రికి రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ధాన్యం సేకరణ, కేంద్ర ప్రభుత్వం వాటా సంబంధిత అంశాలపై కేంద్రమంత్రితో వారు చర్చించారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ నుంచి రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులను మంజూరు చేయాలని వారు కోరారు.

# తల్లిని, చెల్లిని గెంటేసిన వ్యక్తి మహిళా పక్షపాతి అవుతారా?

**మొదటిపేజీ తరువాయి** – విడుదల రజిని గారు టీడీపీ వస్తే అకృత్యాలు జరుగుతాయని అబద్ధాలు మాట్లాడుతున్నారు. ఒక్కసారి గూగుల్ ఓపెన్ చేసి 2023 ఎన్సీఆర్‌బీ నివేదిక చూడండి. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో నేరాలు ఏ స్థాయిలో పెరిగాయో ఆ నివేదిక చెంపదెబ్బ కొట్టినట్లు చెబుతోంది. దక్షిణాదిలో మనకంటే పెద్ద రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడును వెనక్కి నెట్టి ఏపీని నేరాల్లో నంబర్ వన్ చేసిన ఘనత మీ జగన్ రెడ్డిది కాదా?" అని శిరీష ప్రశ్నించారు. దళితులపై అఘాయిత్యాల్లో కూడా రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని, మీ హయాంలో జరిగిన నేరాల చిట్టా చూస్తే ముఖం ఎక్కడ పెట్టుకుంటారని ఆమె నిలదీశారు. చంద్రబాబు పాలనకు, జగన్ గందరగోళ పాలనకు నక్కకూ నాగలోకానికీ ఉన్నంత తేడా ఉందని శిరీష అన్నారు. "ఎన్టీఆర్ గారు ఆస్తిలో మహిళలకు సమాన హక్కు కల్పిస్తే, చంద్రబాబు గారు డ్వాక్రా సంఘాలతో కోటి మంది మహిళలకు ఆర్థిక సాధికారత ఇచ్చారు. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇచ్చి మహిళలను మహారాణులను చేశారు. కానీ, జగన్ రెడ్డి పాలనలో ఏం జరిగింది? అమరావతికి భూములిచ్చిన ఆడబిడ్డలను నడిరోడ్డుపై ఈడ్చి, వారిపై డ్రోన్లు తిప్పి వేధించిన



క్రూరమైన చరిత్ర మీది. సొంత తల్లికి, చెల్లికి గౌరవం ఇవ్వని జగన్ రెడ్డి, రాష్ట్ర మహిళలకు మేలు చేశామని చెప్పుకోవడం ఈ శతాబ్దపు అతిపెద్ద జోక్" అని ఆమె విమర్శించారు.వైసీపీ సోషల్ మీడియా సైకోలు టీడీపీ, జనసేన వీరమహిళలపై పెట్టిన అశ్లీల పోస్టుల ఆధారాలన్నీ తమ వద్ద ఉన్నాయని, తాను కూడా బాధితురాలినేనని శిరీష ఆవేదన వ్యక్తం చేశారు. "జగనన్న వదిలిన బాణం అని పాదయాత్ర చేసిన చెల్లి షర్మిలపైనే నీచమైన పోస్టులు పెట్టిస్తున్నారు. ఆస్తిలో వాటా అడిగినందుకు కన్నతల్లిని బయటకు గెంటేసిన చరిత్ర జగన్‌ది. సొంత బాబాయ్ వివేకానంద రెడ్డిని చంపిన వారిని శిక్షించాలని పోరాడుతున్న ఆయన కూతురు సునీత రెడ్డిపై సాక్షి పత్రికలో రాయిస్తున్న రాతలు ఎంత అసహ్యంగా ఉన్నాయో ప్రజలు గమనిస్తున్నారు. ఇంతటి దమనకాండ సాగించి, ఈరోజు మహిళల గురించి మాట్లాడే నైతిక హక్కు మీకు లేదు" అని శిరీష సవాల్ విసిరారు.జగన్ హయాంలో జరిగిన దారుణాలను ఆమె పేరుపేరునా ప్రస్తావించారు. 'జై జగన్' అనలేదని చంద్రయ్యను గొంతు కోసి చంపడం, మాస్క్ అడిగినందుకు దళిత డాక్టర్ సుధాకర్‌ను వేధించి చంపడం, తన సోదరిని ఏడిపించారని అడిగిన పదేళ్ల బాలుడు అమర్నాథ్ గౌడ్‌ను పెట్రోల్ పోసి తగలబెట్టడం వంటి రాక్షస పాలనను ప్రజలు మర్చిపోలేదన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో ముగ్గురు మహిళలకు కీలక శాఖలు ఇచ్చి చంద్రబాబు మహిళా పక్షపాతి అని నిరూపించుకున్నారని, వైసీపీ నేతలు ఇప్పటికైనా అబద్ధాలు ఆపి మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని గౌతు శిరీష డిమాండ్ చేశారు.

## రానున్నది మరింత కఠిన వేసవి

**మొదటిపేజీ తరువాయి** – ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటవచ్చని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలోని 215 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. కోస్తా, రాయలసీమ ప్రాంతాలు వేడికి అట్టుడికిపోయాయి. శుక్రవారం కూడా మన్యం, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో 43-44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు



నమోదు.సుమారు 30 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, మరో 55 మండలాల్లో వడగాల్పుల ప్రభావం ఉంటుందని హెచ్చరించింది.ఈ ఏడాది వేసవి తీవ్రతకు బలహీనపడిన తూర్పు గాలులే ప్రధాన కారణంగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. హిందూ మహాసముద్రం, బంగాళాఖాతంలో పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో వేడిని తగ్గించే తూర్పు గాలుల ప్రభావం తగ్గింది. అదే సమయంలో, ఉత్తరాది నుంచి వీస్తున్న పొడి, వేడి గాలులు దక్షిణాది రాష్ట్రాలపైకి ప్రభావం చూపుతున్నాయని ఇస్రో నిపుణులు తెలిపారు. దీనికి తోడు, పసిఫిక్ మహాసముద్రంలో లానినా బలహీనపడటం కూడా వాతావరణం వేడెక్కడానికి దోహదం చేస్తోందని వారు అంచనా వేస్తున్నారు.నగరాలు, పట్టణ ప్రాంతాల్లో 'అర్బన్ హీట్ ఐలాండ్స్' ప్రభావం వల్ల వేడి తీవ్రత పెరుగుతోందని, ఇది ప్రజల ఆరోగ్యం, వ్యవసాయ దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆకస్మిక వర్షాలు కురిస్తే తప్ప ఈ వేడి నుంచి ఉపశమనం లభించడం కష్టమని వారు అభిప్రాయపడుతున్నారు.

## మహిళా బిల్లుకు టీడీపీ సంపూర్ణ మద్దతు

**మొదటిపేజీ తరువాయి** – దేశాభివృద్ధిలో సగభాగంగా ఉన్న మహిళల చిరకాల స్వప్నం నెరవేరబోతోందని టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరా యలు హర్షం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై జరిగిన చర్చలో ఆయన పాల్గొని, తమ పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడం అనేది



కేవలం ఒక చట్టం మాత్రమే కాదని, అది కోట్లాది మంది మహిళల ఆకాంక్షలకు దక్కిన గౌరవమని ఆయన అభివర్ణించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో ఈ చారిత్రాత్మక బిల్లు అమలు కాబోతుండటం అభినందనీయమన్నారు.డీలిమిటేషన్ అంశంపై కూడా టీడీపీ తన స్పష్టమైన వైఖరిని చాటింది. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ఆందోళనలపై ఆయన క్లారిటీ ఇచ్చారు. లోక్‌సభ స్థానాల సంఖ్య పెరిగినప్పటికీ, రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య నిష్పత్తిలో మార్పు ఉండబోదని, దీనిపై ఇప్పటికే కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టత ఇచ్చారని గుర్తు చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు డీలిమిటేషన్ ఒక కీలక అడుగని, దీనివల్ల మహిళలతో పాటు యువతకు కూడా రాజకీయాల్లో కొత్త అవకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా సాధికారత కోసం ఎన్నో ఏళ్లుగా సాగుతున్న పోరాటాలకు ఈ బిల్లుతో ఒక తార్కిక ముగింపు లభిస్తుందని లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు.

# రాజధాని పరిధిలో పురుషుల కంటే మహిళలే ఎక్కువ

**మొదటిపేజీ తరువాయి** - మహిళలు ఉన్నారు. సామాజిక వర్గాల వారీగా బీసీ-ఏలో (1090), బీసీ-ఈ (1087), ఓసీల్లో (1108) వర్గాల్లో మహిళల ప్రాతినిధ్యం చాలా బలంగా ఉంది. ముస్లిం మైనారిటీలు(బీసీ-ఈ)లో లింగ నిష్పత్తి 1087గా ఉంది. బీసీ-సి(962) వర్గాల్లో మాత్రం పురుషులతో పోలిస్తే మహిళల జనాభా తక్కువగా ఉంది.

**రంగారెడ్డి జిల్లా..**

రంగారెడ్డి జిల్లాలో 1095 లింగ నిష్పత్తితో తెలంగాణలోనే అగ్రస్థానంలో నిలిచింది.

ఓసీల్లో 1145తో పురుషుల కంటే మహిళల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. రాష్ట్రంలోనే ఇది అత్యధికం.

ఎస్టీల్లో లింగ నిష్పత్తి 1137గా నమోదైంది. బీసీ-సి సామాజిక వర్గంలో 1008గా లింగ నిష్పత్తి ఉంది.

**మేడ్చల్-మల్కాజిగిరిలో..**

మేడ్చల్ జిల్లాలో సగటు లింగ నిష్పత్తి 1066గా ఉంది.

ఈ జిల్లాల్లో ఎస్టీ సామాజిక వర్గంలో 1088, ఓసీల్లో 1097, బీసీల్లో 1053 నిష్పత్తిలో మహిళలు ఉన్నారు. ఎస్సీల్లో సగటు 1026గా ఉంది.

**1000 : 1095**

నగర జీవనంలో అతివల సారథ్యం : పట్టణ ప్రాంతాల్లో సామాజిక మార్పు స్పష్టంగా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మూడు జిల్లాల గణాంకాలను పరిశీలిస్తే కుటుంబానికి మహిళలు వెన్నుదన్నుగా నిలుస్తున్నట్లు ఈ లెక్కలు చెబుతున్నాయి. జీహెచ్ఎంసీలో 21.8 శాతం, రంగారెడ్డి జిల్లాలో 20.4శాతం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 18.9శాతం మంది మహిళలే ఇంటి యజమానులుగా ఉండటం అభినందనీయమైన విషయం. ఈ లెక్కన తెలంగాణవ్యాప్తంగా సగటు 23.9 శాతంగా ఉంది.

**నెలకు రూ.5 వేల సంపాదన :** మహానగరం హైదరాబాద్‌లో నెలకు కేవలం రూ.5 వేలలోపు సంపాదనతో సగటున 9 శాతం



మంది జీవనం కొనసాగిస్తున్నారు. ఇది రాష్ట్ర సగటు(12శాతం) కంటే తక్కువగా ఉంది. రంగారెడ్డి జిల్లాలో 9.3 శాతం, జీహెచ్ఎంసీలో 9.2 శాతం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 8.1 శాతం మంది ప్రజల వార్షిక ఆదాయం ఏడాదికి రూ.50 వేల లోపు మాత్రమే ఉంది.

**ఇంకా బావులు, చేతి పంపులు :** గ్రేటర్ హైదరాబాద్‌లో 89 శాతం మందికి కుళాయిలు ఉండగా మేడ్చల్ జిల్లాలో 86.3 శాతం, రంగారెడ్డి జిల్లాలో 85.3 శాతంగా ఉంది. గ్రేటర్ పరిధిలో చేతిపంపులపై ఆధారపడిన వారు ఇప్పటికీ 3.3 శాతం, మేడ్చల్ జిల్లాలో 2 శాతం, రంగారెడ్డి జిల్లాలో 2.4.శాతం మంది ఉన్నారు.

**కులాంతర వివాహాల్లో టాప్ :** రాష్ట్రంలోనే కులాంతర వివాహాల్లో అగ్రస్థానంలో జీహెచ్ఎంసీ ఉండగా తర్వాత స్థానాల్లో మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలు చోటు దక్కించుకున్నాయి. గ్రేటర్ పరిధిలో 14.3 శాతం కులాంతర వివాహాలు జరగ్గా, మేడ్చల్ జిల్లాలో 9.9.శాతం, రంగారెడ్డి జిల్లాలో 8.4 శాతంగా నమోదు అయ్యాయి.

**ముందస్తు వివాహాలు అధికం :** జీహెచ్ఎంసీలో ముందుస్తు వివాహాలు ఎక్కువగా ఉన్నాయి. 11.1 శాతం మంది పురుషులు పెళ్లి వయస్సు రాక ముందే వివాహాలు చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లాలో 7 శాతం పురుషులు, 7.3 శాతం స్త్రీలు, మేడ్చల్‌లో పురుషులు 6.6శాతం, స్త్రీలు 6.8శాతం మేర చట్టబద్ధ వయసులోపే వివాహ జీవితంలోకి అడుగుపెట్టారు.

**వైద్యం కోసం, రుణమే శరణ్యం! :** వైద్య చికిత్సల కోసం పేదలు రుణాలు తెచ్చి మరీ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఆరోగ్యశ్రీ లాంటి పథకాలున్నప్పటికీ ఏ మాత్రం ఊరట లేదు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో దాదాపు 11.5 శాతం మంది మెడికల్ పరంగా అప్పులు చేస్తున్నారు. నగరంలోని ఎస్సీ కేటగిరీ పేదలు దాదాపు 12.5 శాతం మంది అప్పుల కోసం అనధికార వడ్డీ వ్యాపారులనే ఆశ్రయిస్తున్నారు.

**గ్రేటర్‌లో అక్షరాస్యులు 90 శాతం :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు జిల్లాల్లో కుటుంబ సమగ్ర సర్వేను పరిశీలిస్తే ఆరేళ్ల నుంచి 29 ఏళ్ల వారిలో చదువుకున్న వారు 90 శాతం మంది ఉన్నారు. ఇందులో జీహెచ్ఎంసీ పరిధిలో 84.7శాతం మంది ఉండగా, అత్యధికంగా మేడ్చల్ జిల్లాలో 90.4శాతం మంది విద్యావంతులున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో చదువుకున్న విద్యార్థుల్లో అత్యధికంగా ఇంగ్లీష్ మీడియం వారున్నారు. రెండో స్థానంలో తెలుగు, మూడో స్థానంలో ఉర్దూ మీడియం విద్యార్థులు ఉన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో తెలుగును మాతృ భాషగా మాట్లాడేవారు 53.10శాతంమంది ఉంటే, ఉర్దూ మాతృ భాషగా మాట్లాడేవారు 37.5 శాతం మంది. హిందీ మాతృ భాషగా మాట్లాడుతున్న వారు 6 శాతం ప్రజలు ఉన్నారు.

# దక్షిణాదికి అన్యాయం జరగదు..

**మొదటిపేజీ తరువాయి** – నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై తెలంగాణలో సాగుతున్న ప్రచారాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఢిల్లీలో మీడియా ముఖంగా మాట్లాడిన ఆయన... ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు.ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందంటూ 'నార్త్ వర్సెస్ సౌత్' వివాదాన్ని సృష్టించేందుకు విపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు.దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు ప్రధాని మోదీ సమన్యాయం చేస్తారని, జనాభా ప్రాతిపదికన సీట్ల విభజన జరిగినా దక్షిణాది ప్రాధాన్యత తగ్గబోదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఏపీలో సీట్లు 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కు, తమిళనాడులో 39 నుంచి 59కి పెరిగే అవకాశం ఉందని ఆయన గణాంకాలను వివరించారు.మరోవైపు, మహిళా రిజర్వేషన్ బిల్లుపై కూడా కిషన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. మజ్లిస్ పార్టీ తన సీట్లు ఎక్కడ పోతాయో అన్న భయంతో మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకిస్తోందని, ఆ పార్టీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ వత్తాసు పలుకుతున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన హైబ్రిడ్ ఫార్ములా అసలు ఆయనది కాదని, అది అసదుద్దీన్ ఓవైసీ వెనుక ఉండి చెప్పించిన ఫార్ములా అని ఆయన ఆరోపించారు. కేవలం హైదరాబాద్‌లో ఎక్కువ ఆదాయం వస్తుందని అక్కడ సీట్లు పెంచమంటారా? అని ప్రశ్నించిన ఆయన... డబ్బున్న చోట ఓటు విలువ ఎక్కువగా ఉండాలని కోరుకోవడం ఏ రకమైన ప్రజాస్వామ్యం అని నిలదీశారు. మహిళలను అణగదొక్కే రాజకీయాలకు ఎంఐఎం కేంద్ర బిందువుగా మారిందని, విపక్షాలన్నీ కలిసి మహిళా నాయకత్వాన్ని అడ్డుకుంటున్నాయని ధ్వజమెత్తారు.



# స్టాండప్ కమెడియన్‌పై తెలంగాణ డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు

**కమెడియన్ అనుదీప్ కటికలపై డిప్యూటీ సీఎం భట్టికి ఫిర్యాదు**

**పవన్ కల్యాణ్, రామ్ చరణ్‌పై వ్యక్తిగత వ్యాఖ్యల దుమారం**

**చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన భట్టి విక్రమార్క**

**మెగా ఫ్యామిలీపై విమర్శలు చేస్తే కఠిన చర్యలు తప్పవన్న అభిమాన సంఘాల నేతలు**

స్టాండప్ కామెడీ పేరుతో మెగా ఫ్యామిలీ సభ్యులపై వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారంటూ కమెడియన్ అనుదీప్ కటికలపై అఖిల భారత చిరంజీవి యువత తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై వెంటనే స్పందించిన ఆయన, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నటుడు రామ్ చరణ్ గారు, నిర్మాత, నటి నిహారిక వ్యక్తిగత జీవితాలను కించపరిచేలా అనుదీప్ కటికల వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్టాండప్ కామెడీ ముసుగులో వ్యక్తిత్వ హననానికి పాల్పడటం సరికాదని అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు రవణం స్వామినాయుడు, తెలంగాణ చిరంజీవి యువత అధ్యక్షుడు వెల్పుల వెంకటేశ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "మెగా ఫ్యామిలీపై వ్యక్తిగత దూషణలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు" అని హెచ్చరించారు.



# ప్రమాద సమయంలో ప్రాణాలు కాపాడటంలో సి పి ఆర్ ,ఫస్ట్ ఎయిడ్ కీలకం

## జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**జగిత్యాల ఏప్రిల్ 17 ( ప్రజా మంటలు) :**ప్రమాదం జరిగిన వ్యక్తికి వెంటనే ప్రథమ చికిత్స అందించడం సామాజిక బాధ్యతరోడ్డు ప్రమాద బాధితులను కాపాడితే "రహ్ వీర్" పథకం ద్వారా రూ.25,000 పారితోషకంరాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాలను నియంత్రించడం, ప్రజల్లో ట్రాఫిక్ నియమాల పట్ల బాధ్యతాభావం పెంపొందించడం లక్ష్యంగా అరైవ్ ఆ లైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఫస్ట్ రెస్పాండర్స్‌కు సి పి ఆర్, ఫస్ట్ ఎయిడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ శిక్షణలో ప్రధాన రహదారులకు ఆనుకుని ఉన్న దుకాణాలు, హోటళ్లు, పంక్చర్ షాపులు, పెట్రోల్ బంకులు నిర్వహించే వ్యక్తులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రమాదాలు జరిగినప్పుడు సమయానికి ప్రథమ చికిత్స అందక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ప్రమాదం జరిగిన తర్వాత మొదటి గంటను "గోల్డెన్ అవర్"గా పరిగణిస్తారని, ఈ సమయంలో సరైన చికిత్స అందిస్తే అనేక ప్రాణాలను రక్షించవచ్చని చెప్పారు. ప్రమాద బాధితులకు తక్షణ సహాయం అందించి ఆసుపత్రికి తరలించడం అత్యంత ముఖ్యమని సూచించారు.సోషల్ మీడియాలో చూసి సరైన అవగాహన లేకుండా సి పి ఆర్ ప్రథమ చికిత్స చేయడం వల్ల మరింత ప్రమాదం సంభవించే అవకాశముందని, అందుకే శాస్త్రీయ పద్ధతుల్లో శిక్షణ ఇవ్వడం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాద బాధితులను కాపాడితే "రహ్ వీర్" పథకం ద్వారా రూ.25,000 పారితోషికంరోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ సహాయం అందించి వారి ప్రాణాలను కాపాడే బాధ్యతగల పౌరులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "రహ్ వీర్" పథకం ద్వారా రూ.25,000 నగదు పారితోషికంతో పాటు ప్రశంసా పత్రం అందజేయబడుతుందని ఎస్పీ తెలిపారు. ప్రమాదం జరిగిన తొలి గంట "గోల్డెన్ అవర్"లో బాధితులకు సమయానికి వైద్య సహాయం అందితే ప్రాణాలను రక్షించవచ్చని అన్నారు.ప్రమాదం జరిగిన వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి, గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించి ప్రాణాలను కాపాడే కార్యంలో భాగస్వామి కావాలని కోరారు.ఈ సందర్భంగా వైద్య నిపుణులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రోడ్డు ప్రమాదాలు, స్పృహ తప్పిన పరిస్థితులు, ఎండ దెబ్బ, పాము కాటు, గుండెపోటు వంటి సందర్భాల్లో అందించాల్సిన ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారిణి శ్రీలత, డాక్టర్ శ్రీనివాస్, రాజేందర్, సుదీర్, లవ కుమార్, శ్రీకాంత్, డి సి ఆర్ బి సబ్-ఇన్స్పెక్టర్ ప్రదీప్ , ఫస్ట్ రెస్పాండర్స్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# బుగ్గారం మండలంలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక పర్యటన

## నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాల పనులపై సమీక్ష వేగం, నాణ్యతపై ప్రత్యేక దృష్టి

**బుగ్గారం, ఏప్రిల్ 17 (ప్రజా మంటలు):**జగిత్యాల జిల్లా బుగ్గారం మండలంలో జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా పర్యటించి, నిర్మాణంలో ఉన్న పలు ప్రభుత్వ భవనాల పనులను పరిశీలించారు.మండల కేంద్రంతో పాటు యశ్వంతరావుపేట గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడ జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను సమీక్షించారు. అనంతరం బుగ్గారం గ్రామంలో ఎదుల బోర్లలో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం, మూడు గ్రామ సమైక్య భవనాలు, మండల తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. నిర్మాణ పనులు వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బిల్లుల చెల్లింపులు త్వరలోనే పూర్తవుతాయని, పనుల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా చూడాలని సూచించారు.ఈ పర్యటనలో డీఆర్డీఏ పీడీ రఘువరన్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ గౌడ్, మండల తహసీల్దార్ భూమేశ్వర్, ఇంచార్జ్ ఎంపీడీవో అనుమల్ల వాసవి, ఏపీఎం రమాదేవి, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. అలాగే బుగ్గారం సర్పంచ్ నక్క రాజవ్వ, ఉప సర్పంచ్ జంగ లావణ్య, వార్డ్ సభ్యులు బెజ్జారపు రాజు, పంచాయతీ కార్యదర్శి అక్బర్, విడిసి వ్యవస్థాపక అధ్యక్షులు చుక్క గంగారెడ్డి, కోర్ కమిటీ చైర్మన్ పెద్దనవేని రాగన్న, కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షులు నగునూరి నర్సా గౌడ్ తదితరులు హాజరయ్యారు.





# ప్రత్యేక తెలంగాణ అస్తిత్వాల పరిరక్షణకు 'తెలంగాణ అస్తిత్వ వేదిక' ఆవిర్భావం

**ఏప్రిల్ 19న రవీంద్రభారతిలో ఆవిర్భావ సభ**

**"తెలంగాణ అస్తిత్వం" వ్యాస సంకలనం ఆవిష్కరణ**

**ఆవిర్భావ సభ వివరాలు:తేదీ: ఏప్రిల్ 19, 2026**

**(ఆదివారం) సమయం: ఉదయం 10 గంటలకు**

**వేదిక: రవీంద్రభారతి**




**హైదరాబాద్, ఏప్రిల్ 17 (ప్రజా మంటలు):**తెలంగాణ భూమి కేవలం భౌగోళిక పరిమితి మాత్రమే కాకుండా వేల సంవత్సరాల సాంస్కృతిక, చారిత్రక, ఆధ్యాత్మిక అస్తిత్వాలకు ప్రతీకగా నిలిచిందని ప్రముఖులు పేర్కొన్నారు. ఈ అస్తిత్వాలను పరిరక్షించేందుకు 'తెలంగాణ అస్తిత్వ వేదిక'ను ఏర్పాటు చేస్తున్నట్లు మీడియా సమావేశంలో నిర్వాహకులు, చైర్మెన్ వీరమల్ల ప్రకాశ్ కన్వీనర్ పిట్టల రవీందర్ కో-ఆర్డినేటర్ శ్రీధర్ దేశ్ పాండే లు వెల్లడించారు.గోదావరికృష్ణా నదుల పరివాహక ప్రాంతాలతో, ఆదిమానవుని అడుగుజాడలతో, అనేక తరాల జీవన గాథలతో ముడిపడిన తెలంగాణ నేల ప్రత్యేకతను చాటుకుంటూ నిలిచిందన్నారు. ఈ నేలలో ప్రతి రాయి చరిత్రను చెబుతుందని, ప్రతి చెట్టు జీవన గాథను మోస్తుందని, ప్రతి గీత ఆత్మస్వరాన్ని పలుకుతుందని పేర్కొన్నారు.మీడియా సమావేశంలో ఓపెన్ యూనివర్సిటీ మాజీ చాన్సలర్ సీతారామారావు, సైకాలజిస్ట్ వీరేందర్, ఆర్థిక,రాజకీయ విశ్లేషకులు డి.పాపారావు, విద్యావేత్త రాజ్యలక్ష్మి, సీనియర్ పాత్రికేయులు బుచ్చన్న, సిహెచ్ వి ప్రభాకర్ రావు పాల్గొన్నారు.కాలానుగుణ మార్పులు, వలసాధిపత్య ప్రభావాలు, మతజాతీయవాద శక్తుల ఒత్తిడుల మధ్య కూడా తెలంగాణ తన ప్రత్యేకతను నిలబెట్టుకుందని చెప్పారు. ప్రస్తుతం ఈ అస్తిత్వాలు కొత్త సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో వాటిని పునరుద్ధరించి భావితరాలకు అందించడం అత్యవసరమని అభిప్రాయపడ్డారు.ఈ నేపథ్యంలో విశాల తెలంగాణ ప్రజానీకాన్ని ఒకే వేదికపైకి తీసుకురావడం లక్ష్యంగా 'తెలంగాణ అస్తిత్వ వేదిక'ను స్థాపిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక ఆకర్షణ:గత మూడు నెలలుగా నిర్వహించిన ఆన్‌లైన్ జూమ్ సదస్సుల్లో చర్చించిన అంశాలను సంకలనం చేసి "తెలంగాణ అస్తిత్వం" పేరుతో వ్యాస సంకలనాన్ని ఆవిష్కరించనున్నారు. గౌరవ సత్కారం:జాతీయఅంతర్జాతీయ స్థాయిలో జర్నలిజం రంగంలో విశేష సేవలు అందించిన ఎస్. వెంకట్ నారాయణ గారికి "జీవన సాఫల్య సాధన" అవార్డును ప్రదానం చేయనున్నారు. ఈ అవార్డును డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అందజేయనున్నారు.. ఉద్యమ లక్ష్యాలు: తెలంగాణ అస్తిత్వాలను దెబ్బతీసే కుట్రలను బహిర్గతం చేయడం ప్రజలను అప్రమత్తంగా ఉంచి పరిరక్షణలో భాగస్వామ్యం చేయడంసాంస్కృతిక, సామాజిక, చారిత్రక ప్రత్యేకతలను పునరుద్ధరించడంవనరులను స్థానిక ప్రజల ప్రయోజనాలకు వినియోగించే దిశగా చైతన్యం కల్పించడం ప్రజా ఉద్యమాలకు మద్దతు ఇవ్వడం. ప్రజలకు పిలుపు:ఇది కేవలం ఒక సమావేశం మాత్రమే కాకుండా తెలంగాణ ఆత్మను మేల్కొలిపే ఉద్యమమని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రతి తెలంగాణ వాసి ఈ కార్యక్రమంలో పాల్గొని అస్తిత్వ పరిరక్షణలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

# వెలచ్చేరిలో కాంగ్రెస్ ప్రచారం జోరు

## రెండో రోజూ అడువాల జ్యోతి లక్ష్మణ్ దూకుడు



**జగిత్యాల ఏప్రిల్ 17 (ప్రజా మంటలు) :**తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చెన్నై సౌత్ పరిధిలోని వెలచ్చేరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం మరింత వేగం పుంజుకుంది. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థి జె.ఎం.హెచ్. హసన్ మౌలానా తరపున రెండో రోజు విస్తృత ప్రచారం కొనసాగింది.జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ స్థానిక కాలనీలలో బైక్ ర్యాలీ లో పాల్గొన్నారు. ప్రజలను నేరుగా కలుసుకున్నారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు.ప్రచారం సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున స్పందిస్తూ అడువాల జ్యోతికి బ్రహ్మరథం పట్టారు. శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల్లో కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు.రెండో రోజు ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని, కాంగ్రెస్ పార్టీపై విశ్వాసం పెరుగుతోందని ఆమె పేర్కొన్నారు. వెలచ్చేరిలో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

**జగిత్యాల ఏప్రిల్ 17(ప్రజా మంటలు) :**టీజీఈజెఏసి జగిత్యాల జిల్లా ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలతో నిరసనతెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయుల, కార్మిక , పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కమిటీ విస్తృతస్థాయి కార్యనిర్వాహక సమావేశం (తేది: 07-04-2026) లో తీసుకున్న తీర్మానాల మేరకు జెఏసి రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ మరియు సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు... రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రాలు అందజేయుటలో భాగంగా... టిజిఈజెఏసి జగిత్యాల జిల్లా పక్షాన జిల్లా చైర్మన్ మిర్యాల నాగేందర్ రెడ్డి మరియు జిల్లా కన్వీనర్ కందుకూరి రవిబాబు ఆధ్వర్యంలో ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు మరియు క్లాస్ ఫోర్, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు భాగస్వామ్య సంఘాల ప్రతినిధులు పాల్గొని జిల్లా కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ సమస్యలన్ని పరిష్కరించాలని కోరారు. అనంతరం టిజిఈజెఏసి జగిత్యాల పక్షాన అదనపు కలెక్టర్ శ్రీమతి బిఎస్.లత ద్వారా జిల్లా కలెక్టర్కి వినతి పత్రం అందజేశారు.ఈ సమావేశంలో వీరితోపాటు టిజిఈజెఏసి జిల్లా కో చైర్మన్లు ట్రెసా ఎండి.వకీల్, టిఎన్జీఓ ఊకంటి అమరేందర్ రెడ్డి, టీజీవో మామిడి రమేష్, పిఆర్టియు బోయినపల్లి ఆనంద రావు, ఎస్టియు భైరం హరికిరణ్, శివరామకృష్ణ , టిఆర్టిఎఫ్ తుంగూరి సురేష్, గుర్రం శ్రీనివాస్ గౌడ్, యూటిఎఫ్ శ్యామ్, భూమేశ్వర్, డిటిఎఫ్ ఎన్నం రాంరెడ్డి, గట్ల సంతోష్, టిపిటిఎఫ్ రాంచంద్రం, టీజీఆర్ఈఏ కారబూజ రవీందర్, ఎల్లా గంగారాజం, టీపీసీఏ హన్మంత రెడ్డి, ఏపిడి సునీత, మెప్మా శ్రీనివాస్ గౌడ్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం చంద్రయ్య, అరుణ, నారాయణ, ముజాహిద్ ఖాన్, వివిధ సంఘాల జిల్లా నాయకులు ఎండి.మహమూద్, సాహెద్ బాబు, విజేందర్, గణేష్, రవిచంద్ర, రాజేందర్, రవి కుమార్, రాములు, రాజేశం, సుగుణాకర్, మధుకర్, ప్రమోద్, శ్రీనివాస్, అశోక్ రాజు, మమత, శైలజ, శ్రావణి, విజయలక్ష్మి, రేఖారాణి, శివాని, దివ్య, రమ్య, జనిత,పద్మావతి, కవిత, విజయలక్ష్మి, మునిందర్, తిరుపతి, దుర్గ ప్రసాద్, రామకృష్ణ రెడ్డి, జితేందర్ రెడ్డి, మహేష్, కిరణ్, అశోక్ కుమార్ ఆనంద్, రాజ్ కుమార్, నాగరాజు, నిజాముద్దీన్, అసద్, అబ్దుల ఖలీం, అభిషేక్, వెంకట సాయి, మల్లేష్, బొల్లెం విజయ్, సత్యనారాయణ, ఆశోక్ రావు, గంగాధర్, మల్లికార్జున్, నాగరాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# యువత ప్రతిభకు వేదికగా గంగపుత్ర భీష్మ క్రికెట్ టోర్నీ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్

**జగిత్యాల ఏప్రిల్ 17 ( ప్రజా మంటలు):**జగిత్యాలలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గంగపుత్ర భీష్మ క్రికెట్ టోర్నీ సీజన్ 2 ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, ధైర్యం, జట్టు భావనను పెంపొందిస్తాయని తెలిపారు. క్రికెట్ వంటి క్రీడలు నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.గంగపుత్ర సంఘం ఇలాంటి క్రీడా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయం అని, ఈ టోర్నమెంట్ యువతలోని ప్రతిభను వెలికితీసే మంచి వేదికగా నిలుస్తుందని అన్నారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల క్రీడాకారులకు ఇది మంచి అవకాశమని అభిప్రాయపడ్డారు.టోర్నమెంట్‌లో పాల్గొంటున్న అన్ని జట్లకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, గెలుపు-ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జుంబర్తి గంగ లక్ష్మి రాజ్ కుమార్, ప్రశాంత్ రావు, నాయకులు పృథ్వీధర్ రావు, భీష్మ కప్ నిర్వాహకులు అరుముల్ల పవన్, టీజీ యు డబ్ల్యూ ఎస్ జగిత్యాల అధ్యక్షులు తిరుపతి, అడ్వకేట్ రమేష్, నిర్వాహకులు, క్రీడాకారులు మరియు యువత పాల్గొన్నారు.



# అంగన్వాడీ సేవలు డిజిటల్ విధానంతో మెరుగుపడుతాయి

## రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్




**జగిత్యాల ఏప్రిల్ 17(ప్రజా మంటలు) :**జిల్లా 'మహిళ అభివృద్ధి మరియు శిశు సంక్షేమ" శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు "మొబైల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం"ను జగిత్యాల జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి పాల్గొన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ అంగన్వాడీ సేవలను డిజిటల్ విధానంలోకి తీసుకురావడం ద్వారా పారదర్శకత పెరిగి, లబ్ధిదారులకు సమయానుకూల సేవలు అందుతాయని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వానికి అంగన్వాడీ కేంద్రాల్లోని సేవలను నివేదించడానికి ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. సేవలను పూర్తిగా వినియోగించుకొని పూర్తి స్థాయి సేవలు అందించాలని కోరారు.జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలోని 1065 అంగన్వాడీ కేంద్రాలకు దాదాపు 992 మంది టీచర్లకు, సూపర్ వైజర్లకు మొబైల్ ఫోన్ లు అందిస్తున్న నేపథ్యంలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ మొబైల్ ఫోన్ ల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా అమలు అవుతుండటం ఆనందదాయకమని, అంగన్వాడీ సేవల మెరుగుదల కోసం ప్రభుత్వం మరింత చర్యలు తీసుకుంటుందని తెలిపారు.జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూఅంగన్వాడీ సేవలను డిజిటల్ విధానంలో మెరుగుపరచడం ద్వారా సేవల నాణ్యత పెరిగిందని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ సేవలు సమర్థవంతంగా ఉపయోగించవచ్చని పేర్కొన్నారు.అంగన్వాడీ సేవలు డిజిటల్ విధానంలో మెరుగుపడతాయని, పిల్లలు మరియు గర్భిణీ స్త్రీలకు అందించే అన్ని సేవలు డేటా నిర్ధారణ సులభమవుతుందని, ప్రభుత్వ పథకాల అమలు వేగవంతమవుతుందని తెలిపారు.1065 అంగన్వాడీ కేంద్రాల్లోని 992 మంది అంగన్వాడీ టీచర్లకు, సూపర్వైజర్లకు మొబైల్ ఫోన్ లు అందించడం జరుగుతుందని తెలిపారు. వీటిని ప్రభుత్వ నిబంధనల మేరకు ఉపయోగించి ఆన్లైన్ సేవలను పారదర్శకంగా ప్రభుత్వానికి అందించాలని కోరారు. అలాగే మాన్యువల్ గా రిజిస్టర్ లు కూడా నోమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్లు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని మొబైల్ ఫోన్ లు అందించినందుకు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల ) బి. రాజ గౌడ్, డి డబ్ల్యూ ఓ కె. రాజ్ కుమార్, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, కౌన్సిలర్ లు, సంబంధిత శాఖ అధికారులు, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

# తల్లి శిశు పరస్పర సంభాషణ ప్రదర్శన పై అవగాహన



**వెల్కటూర్ ఏప్రిల్ 17 ( ప్రజా మంటలు) :**ఈనెల తొమ్మిదో తేదీనుండి 23వ తేదీ వరకు నిర్వహిస్తున్న టువంటి పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా వెల్గటూర్ సెక్టార్ వన్ పరిధిలో ఉన్న ,ముక్కట్రావుపేట అంగన్వాడీ సెంటర్లో ఈరోజు సర్పంచ్ కుస లక్ష్మణ్ అధ్యక్షతన తల్లి-శిశు పరస్పర సంభాషణ ప్రదర్శన మరియు ఆటలు-ఆధారిత అభ్యసన ప్రదర్శనల గురించి అవగాహన సమావేశం నిర్వహించడం జరిగింది. ఇట్టి సమావేశంలో సెక్టార్ సూపర్వైజర్ స్వప్న మాట్లాడుతూ తల్లులు పిల్లలు యొక్క భాషా నైపుణ్యాలను పెంపొందించాలని వారితో మాట్లాడుతూ వాళ్ళని తిరిగి మాట్లాడే విధంగా ప్రేరేపించాలని చెప్పడం జరిగింది. పోషకాహారం అందిస్తూ పిల్లలకు శారీరక మానసిక పెరుగుదలకు తల్లిదండ్రులు సంరక్షకులు కృషి చేయాలని తెలియజేయడమైనది. ఇట్టి కార్యక్రమంలో ఉప సర్పంచ్ , వార్డు సభ్యులు , కార్యదర్శి ఆశ వర్కర్ పిల్లల తల్లిదండ్రులు అంగన్వాడి టీచర్ ఆయమ్మ పాల్గొన్నారు.

# సురభి గోషాలలో గో గ్రాసం పంపిణీ

**జగిత్యాల రూరల్ ఏప్రిల్ 17 (ప్రజా మంటలు) :**జిల్లా కేంద్రానికి సమీపంలోని తాటిపల్లి సురభి గోశాలలో గోవుల గ్రాసం గడ్డి, తవుడు, మేత కోసం ఒక వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. జగిత్యాల వాస్తవ్యులైన ఊటూరి అశోక్ కుమార్, తాటికొండ శ్రీనివాస్, బాసెట్టి లవ కుమార్, ప్రతినెల అమావాస్య రోజు ఒక్కొక్కరివద్ద 100 చొప్పున, వసూలు చేసి గోవులకు గ్రాసం ఇవ్వడానికి నిశ్చయించారు. 12 వేల రూపాయల విలువ గల 432 కిలోల తవుడు ఇవ్వడం జరిగింది. ఈ నాటి కార్యక్రమాన్ని ప్రముఖ పౌరాణిక వేద పండితులు శృంగేరి శారదా పీఠం ఆస్థాన విద్వాంసులు బ్రహ్మశ్రీ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి ప్రారంభించి, గోవుల యొక్క ప్రత్యేకతను వివరించారు. ఈనాటి కార్యక్రమంలో గోశాల అధ్యక్షుడు డా. తురగ రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు మంచాల జగన్, కార్యదర్శి బండారు కమలాకర్ రావు, కోశాధికారి జలగం జలంధర్ రావు, సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు. వచ్చిన అతిథులందరికీ నిర్వాహకులు అల్పాహారం ఏర్పాటు చేశారు



# డ్రగ్స్ రహిత హైదరాబాద్...తమ టార్గెట్

## సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్

## గాంధీలో డీ ఆడిక్షన్ సెంటర్ విజిట్

**సికింద్రాబాద్, ఏప్రిల్ 17 ( ప్రజామంటలు):**నగరంలో మాదకద్రవ్యాల మహమ్మారిని పూర్తిగా నిర్మూలించి డ్రగ్స్ రహిత హైదరాబాద్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని నగర పోలీస్ కమిషనర్ వీ.సీ. సజ్జనర్ స్పష్టం చేశారు. సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో ఇటీవల ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు.ఇటీవల టాస్క్ ఫోర్స్ పోలీసులు నిర్వహించిన డ్రగ్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన రౌడీ షీటర్లతో సీపీ నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని, వ్యసనం నుంచి బయటపడేందుకు తీసుకుంటున్న చర్యలను తెలుసుకున్నారు. బాధితుల కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడి వారికి ధైర్యం ఇచ్చారు. అనంతరం వైద్యులతో సమావేశమై చికిత్స, కౌన్సెలింగ్ విధానాలను సమీక్షించారు. రెండు వారాల పాటు వీరికి కౌన్సిలింగ్, ట్రీట్మెంట్ ఉంటుందని డాక్టర్లు తెలిపారు. మీడియాతో సీపీ సజ్జనార్ మాట్లాడుతూడ నగరంలో రౌడీ షీటర్ల కదలికలపై నిశిత నిఘా ఉంచామని తెలిపారు. 239 మందికి డ్రగ్ పరీక్షలు నిర్వహించగా, 188 మందికి పాజిటివ్ వచ్చినట్లు వెల్లడించారు. ప్రస్తుతం 35 మంది గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, మిగిలిన వారికి ఇతర కేంద్రాల్లో కౌన్సెలింగ్ అందిస్తున్నామని చెప్పారు. 15 రోజుల ప్రత్యేక చికిత్సతో వారిలో మార్పు వస్తుందనే నమ్మకం వ్యక్తం చేశారు.నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో డ్రగ్ డిటెక్షన్ కిట్లు అందుబాటులో ఉంచామని, రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులకు పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 35 డీ-అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు చారిత్రక నిర్ణయమని పేర్కొన్నారు.డ్రగ్స్ విక్రేతలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, నిందితులపై హిస్టరీ షీట్లు తెరిచి కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. హెచ్-న్యూ విభాగం డ్రగ్స్ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్. వాణి, సైకియాట్రీ హెచ్ఓడీ డాక్టర్ సురేష్, డీసీపీలు రక్షితా కృష్ణామూర్తి, వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, అదనపు డీసీపీ అందే శ్రీనివాస రావు,ఆర్ఎంవో లు డా.శేషాద్రి,డా.యోగేందర్,డా.రజని,ఏసీపీ శశాంక్ రెడ్డి, సీఐ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదు



**బుగ్గారం ఏప్రిల్ 17 (ప్రజా మంటలు):**బుగ్గారం మండలంలో అధికారులు ప్రోటోకాల్‌ను పాటించడం లేదని, అధికార పార్టీ నాయకులు కూడా తప్పులు చేస్తున్నారని మద్దునూర్ మాజీ సర్పంచ్ బత్తుల తిరుపతి విమర్శించారు."ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" సమావేశంలో ప్రోటోకాల్ ఉల్లంఘనలు జరిగాయని, అధికారులను వేదికపైకి ఆహ్వానించకపోవడం, ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం తప్పని అన్నారు. ఈ విషయాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు.అదే సమయంలో, తాను అనుకోకుండా సమావేశంలో అడ్డుపడిన విషయంపై క్షమాపణలు తెలిపారు.

# భగ్గుమంటున్న సూరీడు

**వచ్చే 6 రోజులు బీ కేర్‌ఫుల్, ఈ జాగ్రత్తలు పక్కా**

**రాష్ట్రంలో పెరిగిన ఎండలతో అల్లాడిపోతున్న జనం**

**రానున్న ఆరు రోజులు రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు**

**వడగాలుల నేపథ్యంలో అప్రమత్తమైన ప్రభుత్వం**

**ఉపశమన చర్యల కోసం కీలక ఆదేశాలు జారీ**



రాష్ట్రంలో మండుతున్న ఎండలతో వాతావరణం నిప్పుల కొలిమిగా మారింది. ఎండ వేడిమితో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండల తీవ్రత క్రమంగా పెరగడంతో బుధ, గురువారం పలు జిల్లాల్లో వడగాలులు నమోదయ్యాయి. దీంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఈ మేరకు జిల్లాలకు తక్షణ చర్యలకు ఆదేశాలను జారీ చేసింది.జిల్లా కలెక్టర్లను నోడల్ ఆఫీసర్లుగా నియమిస్తూ రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.దానకిశోర్ ఆదేశాలు జారీచేశారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి వైద్య, రెవెన్యూ, పంచాయతీరాజ్/పురపాలక/నగరపాలక, మిషన్ భగీరథ, అగ్నిమాపక, కార్మిక తదితర శాఖల ఆధ్వర్యంలో ఉపశమన చర్యలు చేపట్టాలని ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు జారీచేశారు.ఐదు రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు ఉమ్మడి ఖమ్మం, నిజామాబాద్, వరంగల్, నల్గొండ జిల్లాల్లో వడగాలులతో, సంబంధిత రుగ్మతలతో 10 మందికిపైగా మృత్యువాత పడ్డారు.రానున్న 6 రోజులు మరింత అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యేందుకు అవకాశాలున్నాయనే అధికారుల సూచనల నేపథ్యంలో మధ్యాహ్న సమయంలో వీలైనంతవరకు నీడలో ఉండాలని, బయటకు రావొద్దని నిపుణులు సూచిస్తున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3.30 వరకు వేడిగాలులు(హీట్‌వేవ్స్) వీచే అవకాశాలున్నాయని తప్పనిసరై బయటకువెళితే తలకు కర్చీఫ్ ధరించాలని, చలువ కళ్లజోళ్లు పెట్టుకోవాలని, తరచూ నీళ్లు/మజ్జిగ తాగుతుండాలని వైద్యులు సూచిస్తున్నారు.రెండు రోజులు వేడిగాలులు(హీట్‌వేవ్స్) నమోదైన ప్రాంతాలను 'రెడ్'అలెర్ట్ జోన్లుగా పరిగణించాలని నిర్ణయించారు. ఈ ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకునేవిధంగా ప్రభుత్వ శాఖలు దృష్టికేంద్రీకరించాల్సి ఉంటుంది. ప్రధానంగా పాఠశాలల పనివేళలు కుదించాలి. లేదా తరగతులను రద్దు చేయడం ఉత్తమం. విద్యార్థులు సమయానికి నీళ్లు తాగేలా విద్యాలయాల్లో నీటి గంటలు కొట్టాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ, చల్లదనం విషయంలో చర్యలు తీసుకునేవిధంగా విద్యాశాఖను అప్రమత్తం చేయాలని విపత్తుల నిర్వహణశాఖ కలెక్టర్లను ఆదేశించింది. దీంతోపాటు పలు చర్యలను సూచించింది.పలుచోట్ల కూలింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలి. బస్టాండ్లు, రద్దీ ప్రాంతాల్లో షెల్డను నిర్మించాలి. వడగాలుల ముప్పున్న ప్రాంతాలు, అధిక ఉష్ణోగ్రత నమోదయ్యే చోట్ల చలివేంద్రాలు(మంచినీళ్లు), మజ్జిగ పంపిణీని చేపట్టాలి.వడగాలులకు సంబంధించిన కేసులు హాస్పిటల్‌లో నమోదైతే ప్రభుత్వానికి వవెంటనే సమాచారం ఇవ్వాలి. బాధితులకు ఐస్ ప్యాక్స్, కూలర్లు, ఏసీలు ఏర్పాటుచేసి ఉపశమనం కల్పించాలి. ఎండవేళ కార్మికులు విశ్రాంతి తీసుకునేలా చర్యలు చేపట్టాలి. భవన నిర్మాణాలు, ఇతర నిర్మాణ ప్రదేశాల్లో చల్లని నీళ్లు, నీడ ప్రాంతాలను ఏర్పాటు చేయాలి. వృద్ధులు, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు హీట్‌వేవ్స్ బారినపడే ప్రమాదం ఉన్నందున స్త్రీ శిశు సంక్షేమ, వైద్య శాఖలు అప్రమత్తం కావాలి. వడగాలులు నమోదైన జిల్లాలు : బుధ, గురు వారాల్లో మేడ్చల్ మల్కాజిగిరి (మేడిపల్లి), దుండిగల్ (గండిమైసమ్మ, బాచుపల్లి), సంగారెడ్డి (హత్నూర, వట్పల్లి, సిర్గాపూర్, జిన్నారం, అమీన్‌పూర్), సిద్దిపేట (అక్కన్నపేట, సిద్దిపేట గ్రామీణం, అర్బన్) , రంగారెడ్డి (కందుకూరు, యాచారం, గండిపేట, షాబాద్), కామారెడ్డి (పాల్వంచ, దోమకొండ), నల్గొండ (దేవరకొండ, అడవి దేవులపల్లి, చింతపల్లి), మెదక్ (కుల్చారం, చేగుంట), నిజామాబాద్ (బాల్కొండ, ముప్కల్), జిల్లాల్లో హీట్ వేవ్స్ నమోదయ్యాయి.

**జగిత్యాల జిల్లాలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత :** తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధికంగా జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలో 44.4 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత గురువారం నమోదయింది. ఈ ఏడాదిలో ఇంతవరకు ఇదే రికార్డు స్థాయిలో నమోదు కావడం గమనార్హం. మరో 9 జిల్లాల్లో(ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నల్గొండ, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, సిద్దిపేట)నూ 44 డిగ్రీల సెల్సియస్ దాటింది. 8 జిల్లాల్లో 43 నుంచి 43.8 డిగ్రీల మధ్య11 జిల్లాల్లో 42 నుంచి 42.9 మధ్య.. 4 జిల్లాల్లో 41.5-41.8 మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# ఒంటిమిట్ట రాములోరి హుండీ లెక్కింపు

**ఒంటిమిట్ట రాములోరి ఆలయంలో హుండీ లెక్కింపు**

**మొత్తం రూ.29,00,205 వరకు ఆదాయం వచ్చినట్లు వెల్లడించిన ఆలయ అధికారి నవీన్ కుమార్**

**నెలరోజుల వ్యవధిలోనే ఈ స్థాయిలో రావడం ఇదే తొలిసారని వివరణ**



వైఎస్సార్ కడప జిల్లాలో ఒంటిమిట్ట కోదండరామ స్వామివారి దేవాలయంలో హుండీ లెక్కింపు ప్రక్రియను చేపట్టారు. ఈ లెక్కింపులో భాగంగా దాదాపు రూ.29,00,205 వరకు ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి నవీన్ కుమార్ ఈ సందర్భంగా వెల్లడించారు. అయితే ఆలయంలోని రంగ, ముఖ మండపం, భక్త సంజీవరాయ స్వామి ఆలయంలో హుండీలను తెరిచి లెక్కించారు.అంతేకాకుండా టీటీడీ పరిపాలన అదే విధంగా విజిలెన్స్ అధికారుల పర్యవేక్షణలో శ్రీవారి సేవకులు ఈ హుండీ లెక్కింపును ప్రారంభించారు. అదే విధంగా మార్చి 26 నుంచి ఈ నెల 5 వరకు శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీరాముడి దర్శన భాగ్యం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అందరి ఆరాధ్య దైవమైన జగదభిరాముడిని దర్శించుకున్న అనంతరం భక్తులు హుండీల్లో కానుకలను వేశారు. కేవలం నెల రోజుల వ్యవధిలోనే ఆలయానికి రూ. 29 లక్షల వరకు ఆదాయం సమకూరడం గడిచిన గత పది సంవత్సరాల కాలంలో ఇదే తొలిసారని ఆలయ అధికారులు పేర్కొనడం గమనార్హం.

**అంకురార్పణతో ప్రారంభం:** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో మార్చి 26న అంకురార్పణతో ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఏప్రిల్ 5 వరకు వైభవంగా జరిగాయి. ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ రోజైన మార్చి 31వ తేదీ ఉదయం మోహినీ అలంకారంలో రాములవారు జగన్మోహనాకారుడిగా దర్శనమిచ్చారు. ఆ రోజు ఉదయం 7.30 గంటలకు స్వామివారి ఊరేగింపు వైభవంగా ప్రారంభమైంది. కేరళ డ్రమ్స్, కోలాటాలు, భక్తజన బృందాలు చెక్క భజనలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. వాహన సేవలో ఆలయ డిప్యూటీ ప్రశాంతి, సూపరింటెండెంట్ శ్రీ హనుమంతయ్య, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

**2,500 మంది పోలీసులతో భద్రత:** కల్యాణానికి లక్ష మంది భక్తులు వస్తారనే అంచనాతో టీటీడీ ఏర్పాట్లు చేయగా ఆ స్థాయిలోనే భక్తులు ఒంటిమిట్టకు రావడం గమనార్హం. అంతేకాకుండా గ్యాలరీల్లో కూర్చునే భక్తులకు తీర్థప్రసాదాలు, ముత్యాల తలంబ్రాలు, మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లతో పాటు తిరుమల శ్రీవారి లడ్డూను కూడా ఉచితంగా అందించారు. అదే విధంగా భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు మొత్తం 2,500 మంది పోలీసులతో భద్రతను కల్పించారు. స్వామివారి కల్యాణానికి ముందు ఒంటిమిట్ట ఆలయం నుంచి సీతారాముల ఉత్సవ విగ్రహాల శోభాయాత్ర లక్షలాది భక్తజన సందోహం నడుమ కోలాహలంగా సాగింది.

# ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు పూర్తి

**ఇక రయ్‌మంటూ దూసుకెళ్లొచ్చువైరా, ఖమ్మం వరకు ఈ నెలాఖరు నాటికి పూర్తి కానున్న పనులు**

**మొత్తం పనులు పూర్తి అయ్యాక అధికారికంగా ప్రారంభంకానున్న హైవే**

**విశాఖ, హైదరాబాద్ మధ్య ప్రయాణ దూరం తగ్గిందని హర్షం**



తెలుగు రాష్ట్రాలకు కొత్త జాతీయ రహదారి అందుబాటులోకి వచ్చింది. ఖమ్మం-దేవరపల్లి 365 బీజీ గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ట్రయల్ రన్‌లో భాగంగా వాహనాల రాకపోకలకు అనుమతివ్వడంతో రయ్ రయ్‌మంటూ దూసుకెళ్తున్నాయి.100 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో ప్రయాణం : విశాఖపట్నం-హైదరాబాద్ మధ్య దూరాన్ని తగ్గించేందుకు చేపట్టిన ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ రహదారి పనులు 2022లో ప్రారంభమయ్యాయి. 4 వేల 451 కోట్లతో 162 కిలోమీటర్ల రహదారి విస్తరణ పనులు చేపట్టారు. 365 బీజీ నేషనల్ హైవే పేరిట పచ్చని పొలాల మధ్య నాలుగు వరుసల రహదారి నిర్మించారు. దేవరపల్లి నుంచి తెలంగాణలోని వైరా వరకు పనులు పూర్తయ్యాయి. జాతీయ రహదారుల నిర్వహణ సంస్థ అధికారులు ట్రయల్ రన్‌కు అనుమతించారు. సోమవారం నుంచి నాలుగు వరుసల రహదారిపై భారీ వాహనాలు దూసుకుపోతున్నాయి. కార్లు 100 కిలోమీటర్లు, ఇతర వాహనాలు 80 కిలోమీటర్ల వేగంతో ప్రయాణానికి అవకాశం కల్పించారు. ఈ కొత్త రహదారిపై ప్రయాణం సుఖవంతంగా ఉందని వాహనదారులు చెబుతున్నారు."ఖమ్మం-దేవరపల్లి రహదారి చాలా బాగుంది. ఇంతకు ముందు పట్టినంత సమయం ఇప్పుడు ప్రయాణానికి అంతగా పట్టడం లేదు. ఇంతకు ముందు ప్రయాణించాలంటే చాలా ఇబ్బందిగా ఉండేది. కానీ ఇప్పుడు ఈ రోడ్ వేసి నందుకు చాలా సౌకర్యవంతంగా ఉంది. గేర్లు మార్చేందుకు ఇంతకు ముందు ఉన్నంత ఇబ్బంది ఇప్పుడు లేదు. ఈ రహదారి కారణంగా మూడు గంటలు పట్టే ప్రయాణం కూడా గంట తేడాతో రెండు గంటలు మాత్రమే పడుతుంది. వాహనాలకు మైలేజ్ కూడా బాగా వస్తుంది. రహదారి లేనందువల్ల ఇంతకు ముందు ఊరు లోపల నుంచి వెళ్లాల్సి వచ్చేది. కానీ ఈ రహదారి కారణంగా ఇప్పుడు అలాంటి ఇబ్బందులు ఏమీ లేవు. ప్రయాణం చాలా సాఫీగా సాగిపోతుంది." -ప్రయాణికులు

**ఇరువైపులా 8 వరుసలు :** రహదారిపై సాంకేతిక పనులు శరవేగంగా సాగుతున్నాయి. జాతీయ రహదారిపైకి ఎక్కేచోట్ల, దిగే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన టోల్ గేట్ల వద్ద సీసీ కెమెరాలు, ఫాస్టాగ్‌కు సంబంధించిన పరికరాలు అమర్చుతున్నారు. దేవరపల్లి టోల్ గేట్ల వద్ద ఇరువైపులా 8 వరుసలను ఏర్పాటు చేశారు. వాహనదారులు టోల్ రుసుము చెల్లించేటప్పుడు సమయం వృథా కాకుండా చేస్తున్న ఏర్పాట్లు చివరి దశకు చేరాయి.

**వాహనాలకు ఇంటర్ ఛేంజ్‌లుగా వీలు :** 365 బీజీ గ్రీన్ ఫీల్డ్ హైవేపై ఎంత దూరం ప్రయాణిస్తే ఆ మేరకు మాత్రమే టోల్ వసూలు చేస్తారు. యాక్సెస్ కంట్రోల్డ్ హైవే నేపథ్యంలో ఇంటర్ ఛేంజ్‌లుగా వీలు కల్పించిన ప్రదేశాల వద్ద ప్రవేశం, బయటకు వెళ్లే మార్గాల నుంచి మాత్రమే రహదారిపైకి రావడానికి, దిగడానికి అవకాశం కల్పించారు. ఆంధ్రప్రదేశ్ పరిధిలో దేవరపల్లి, పొంగుటూరు, జంగారెడ్డిగూడెం సమీపంలోని పుట్లగట్టగూడెం, రేచర్ల వద్ద మాత్రమే వాహనాలు ఎక్కి, దిగడానికి రోడ్డు నిర్మించారు. వైరా నుంచి ఖమ్మం వరకు ఈ నెలాఖరు నాటికి మొత్తం పనులు పూర్తవ్వనున్నాయి. ఆ తర్వాత 365 బీజీ రహదారిని అధికారికంగా ప్రారంభించనున్నారు.

# ఉత్తరాంధ్రకు మరో భారీ పరిశ్రమ

**రూ.8,175 కోట్లతో లిథియం అయాన్ బ్యాటరీ యూనిట్**

**ఏపీని గ్లోబల్ క్లీన్ ఎనర్జీ తయారీ కేంద్రంగా నిలబెట్టే దిశగా కీలక అడుగు**

**రూ.8,175 కోట్ల పెట్టుబడితో లిథియం అయాన్ బ్యాటరీ యూనిట్**

ఆంధ్రప్రదేశ్‌ను క్లీన్ ఎనర్జీ మ్యాప్‌పై మరింత బలంగా నిలబెట్టే మెగా అడుగు త్వరలోనే పడనుంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ. 8 వేల 175 కోట్ల పెట్టుబడితో లిథియం అయాన్ బ్యాటరీ తయారీ యూనిట్ ఏర్పాటు కానుంది. వేలాది ఉద్యోగాలు, ప్రపంచస్థాయి సాంకేతికతతో ఈ ప్రాజెక్టు భవిష్యత్ అవసరాలకు శక్తివంతమైన ఆధారంగా నిలవనుంది.ఉత్తరాంధ్ర ప్రాంతం ఇప్పటికే భారీ పెట్టుబడులకు కేంద్రబిందువుగా మారుతున్న తరుణంలో మరో భారీ పరిశ్రమ ఆ ప్రాంతంలో ఏర్పాటు కానుంది. విశాఖపట్నం, అనకాపల్లి పరిసరాల్లో ఏర్పాటవుతున్న భారీ స్టీల్, ఫార్మా, పెట్రోకెమికల్, ఐటీ ప్రాజెక్టులు ఈ ప్రాంతాన్ని పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్దుతున్నాయి. ఇటీవల ప్రకటించిన డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు, పోర్ట్ ఆధారిత అభివృద్ధి కార్యక్రమాలు ఉత్తరాంధ్రకు కొత్త ఆర్థిక వేగాన్ని తీసుకొస్తున్నాయి. తాజాగా రాంబిల్లిలో ఏర్పాటు కానున్న లిథియం అయాన్ బ్యాటరీ తయారీ యూనిట్ ప్రాంతీయ పారిశ్రామిక అభివృద్ధికి మరో మైలురాయిగా నిలవనుంది.

**గ్లోబల్ క్లీన్ ఎనర్జీ తయారీ కేంద్రం:** సెల్ నుంచి ప్యాక్, ఎనర్జీ మేనేజ్‌మెంట్ వరకు ఒకే చోట సమగ్ర వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాజెక్టు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందనుంది. ముఖ్యంగా పునరుత్పాదక ఇంధన వినియోగం పెరుగుతున్న సమయంలో ఎనర్జీ స్టోరేజ్ రంగంలో ఈ యూనిట్ కీలక పాత్ర పోషించనుంది. దాదాపు 3వేల మందికి ఉపాధి కల్పించడమే కాకుండా, అనుబంధ పరిశ్రమలు, సరఫరా గొలుసు అభివృద్ధికి దోహదం చేస్తుంది. భవిష్యత్తులో 20 గిగావాట్ అవర్ సామర్థ్యానికి విస్తరణ లక్ష్యంతో ముందుకెళ్తున్న ఈ ప్రాజెక్టు ఉత్తరాంధ్రను గ్లోబల్ క్లీన్ ఎనర్జీ తయారీ కేంద్రంగా నిలబెట్టే దిశగా కీలక అడుగుగా అంచనా వేస్తున్నారు.ప్రాజెక్టు మొదటి దశ 2027 జులై నాటికి పూర్తి చేసి వాణిజ్య ఉత్పత్తిలోకి తేవాలన్నది లక్ష్యం. ఈ పరిశ్రమకు సుమారు 300 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ప్రాజెక్టును విస్తరించడం ద్వారా భవిష్యత్తులో 20 గిగావాట్ అవర్ సామర్థ్యం గల ఏసీసీ లిథియం అయాన్ సెల్స్ ఉత్పత్తి, దానికి సమానంగా 20 గిగా వాట్ అవర్ సామర్థ్యం గల బ్యాటరీ ప్యాక్, బెస్ తయారీకి అవసరమైన బ్యాటరీలు ఉత్పత్తి చేయాలన్నది సంస్థ లక్ష్యం. ఈ సంస్థ అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ బ్యాటరీలు, బ్యాటరీ ప్యాక్‌ల తయారీపై ప్రధానంగా దృష్టి పెట్టింది.

**ఇంధన నిల్వ రంగానికి విస్తరణ:** రాబోయే ఇతర ఇంధన నిల్వ సాంకేతికతనూ పరిశీలిస్తోంది. ఈ సంస్థ ఇప్పటికే గుజరాత్‌లోని నోయిడా, టెక్సాస్‌లో 14.9 గిగావాట్ సోలార్ మాడ్యూల్స్ తయారీ యూనిట్‌లను నిర్వహిస్తోంది. అమెరికా, కెనడా, ఇటలీ, తుర్కియే, వియత్నాంతో పాటు 30 దేశాలకు ఎగుమతి చేస్తోంది. 545, 700ల వాట్ పీక్ సోలార్ మాడ్యూల్స్‌ను తయారు చేసే తొలి స్వదేశీ సంస్థలలో ఒకటిగా నిలిచింది. మాడ్యూల్స్ తయారీ నుంచి ఇంధన నిల్వ రంగానికి విస్తరించే లక్ష్యంతో ఏపీలో పరిశ్రమ ఏర్పాటు చేస్తోంది.

# మంగ్లీ కేసులో కీలక పరిణామం

**ఎట్టకేలకు పోలీసులకు చిక్కిన రమావత్ మధు**

**రియల్ ఎస్టేట్ పెట్టుబడుల పేరుతో భారీ మోసం**

**33 మంది దగ్గర మొత్తం రూ.6.58 కోట్లు వసూలు**

**కీలక నిందితుడు రమావత్ మధును అరెస్టు చేసిన ఈవోడబ్ల్యూ పోలీసులు**



రియల్ ఎస్టేట్ పెట్టుబడుల పేరుతో అమాయక ప్రజలను బురిడీ కొట్టించి, రూ.కోట్లలో మోసగించిన నిందితుడు రమావత్ మధును సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శుభక్షేత్ర వెంచర్ పేరుతో 31 మంది వద్ద రూ.6.58 కోట్లు వసూలు చేసిన కేసులో మధు నిందితుడిగా ఉన్నాడు. గతేడాది నల్గొండ జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లో నమోదైన గోకులానంద ఇన్‌ఫ్రా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మోసం కేసులోనూ రమావత్ మధునే కీలక నిందితుడు.

**ఈవోడబ్ల్యూలో నమోదైన కేసు వివరాల ప్రకారం :** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు జేపీ కాలనీకి చెందిన కత్రిక సంతోశ్ (33) అనే వ్యక్తి వ్యాపారి. అతనికి ఎల్బీనగర్ ప్రాంతానికి చెందిన బండి శివకుమార్, సంగారెడ్డికి చెందిన రమావత్ మధు, రమావత్ సక్రులు పరిచయమయ్యారు. ఈ ముగ్గురూ కలిసి సంయక్తంగా ఓ పెట్టుబడి పథకాన్ని ప్రారంభిస్తున్నట్లుగా ప్రచారం మొదలుపెట్టారు. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని దామరగిద్ద గ్రామంలో 16 ఎకరాల్లో శుభక్షేత్ర వెంచర్ ప్రారంభిస్తున్నట్లు అందరికీ వివరించేవారు.ఇదే పేరుతో మియాపూర్‌లో ఆఫీస్‌ను ప్రారంభించారు. ఈ స్కీమ్‌లో భాగంగా ఎవరైనా రూ.5 లక్షలు, అంతకంటే ఎక్కువ డబ్బు కడితే తాము ప్రారంభించే వెంచర్‌లో 102 చదరపు గజాల స్థలాన్ని రిజిస్టర్ చేస్తామని, అదనంగా రూ.5 లక్షల ఇన్సూరెన్స్‌తో పాటు 42 నెలల పాటు రూ.25 వేల చొప్పున చెల్లిస్తామని చెప్పారు. వారు చెప్పిందంతా నిజమేనని భావించిన కత్రిక సంతోశ్ సెప్టెంబర్ 2025లో రూ.5 లక్షలు చెల్లించాడు. అతడిలాగే మరో 33 మంది మొత్తం రూ.6.58 కోట్లు కట్టారు. ఈ ఘటన జరిగి దాదాపు ఆరు నెలలు గడిచినప్పటికీ శివకుమార్, మధు, సక్రు ప్లాట్లను మాత్రం రిజిస్టర్ చేయలేదు. నెలవారీగా ఇవ్వాల్సిన రూ.25 వేలు చెల్లించడం లేదు. దీనిపై ప్రశ్నించగా ఆఫీసు దగ్గర బౌన్సర్లను పెట్టి బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో తాము మోసపోయామని గుర్తించిన బాధితులు పోలీసులను ఆశ్రయి ంచారు.

**సింగర్ మంగ్లీపైనా కేసు :** తాజాగా పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో న్యాయవాది సింగపోగు సుబ్బారావు ఫిర్యాదుతో నమోదైన కేసులోనూ రమావత్ మధు నిందితుడిగా ఉన్నారు. ప్రముఖ గాయని మంగ్లీ, రమావత్ మధు, శైలజా చౌహాన్, భరత్ చౌహాన్, శివ తదితరులు 100-150 మంది దగ్గర పెట్టుబడులకు అధిక లాభాల పేరిట రూ.10 కోట్ల వరకూ వసూలు చేశారని సుబ్బారావు మార్చి 27న ఫిర్యాదు చేశారు. పోలీసులు మంగ్లీ సహా మిగిలిన వారిపై కేసులు నమోదు చేశారు.

**ఇదీ కేసు నేపథ్యం :** గోకులనంద ఇన్‌ఫ్రా ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఫ్రాడ్ కేసులో రమావత్ మధు నిందితుడు. తమ సంస్థలో పెట్టుబడులు పెట్టినట్లయితే అధిక లాభాలను ఇప్పిస్తామంటూ దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని ప్రజల నుంచి రూ.కోట్లలో వసూలు చేసి మోసానికి పాల్పడ్డారు. ఈ ఘటనపై పీఏపల్లి పోలీస్ స్టేషన్‌లో మధు సహా 9 మందిపై కేసు నమోదైంది. ఇది భారీ మోసం కేసు కావడంతో సీఐడీకి బదిలీ అయ్యింది. తాజాగా నిందితుడు రమావత్ మధును ఈవోడబ్ల్యూ పోలీసులు అరెస్టు చేశారు.

**ఆఫర్లు చూసి మోసపోవద్దు :** రియల్ ఎస్టేట్ రంగంలో ఇలాంటి నమ్మశక్యం కాని ఆఫర్లను చూసి ప్రజలు మోసపోవద్దని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఏదైనా వెంచర్‌లో పెట్టుబడి పెట్టేముందు చట్టపరమైన అనుమతులు సహా అన్ని వివరాలు సరిచూసుకోవాలని సూచిస్తున్నారు. ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు.

# సుర్రుమంటున్న సీమ!

**కడప 'గడప' దాటొద్దని వాతావరణశాఖ హెచ్చరిక!**

**రాష్ట్రంలో భగ్గుమంటున్న ఎండలు**

**మరో మూడు రోజుల తర్వాత చల్లబడే చాన్స్!**

ఎండలు భగ్గుమంటున్న నేపథ్యంలో అమరావతి వాతావరణ కేంద్రం రానున్న వారం రోజుల పరిస్థితిని వెల్లడించింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు మరో 4 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మూడు రోజుల తర్వాత ఈ నెల 19 నుంచి 22 వరకు ఉత్తర కోస్తా, రాయలసీమలో జల్లులు పడే అవకాశం ఉందని వెల్లడించింది. దక్షిణ కోస్తా జిల్లాల్లో ఉక్కపోత, అసౌకర్యమైన వాతావరణం ఉంటుందని తెలిపింది.ఏపీలో మూడు ప్రాంతాల్లో భిన్న రకాల వాతావరణం నెలకొంది. ఉత్తర కోస్తాలోని కొన్ని ప్రాంతాల్లో వర్ష సూచన వెల్లడించిన అమరావతి వాతావరణ కేంద్రం దక్షిణ కోస్తాలో ఉక్కపోత వాతావరణం ఉంటుందని తెలిపింది. ఇక రాయలసీమలో 40డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ప్రకటించింది. గడిచిన 24గంటల్లో నంద్యాల జిల్లా సంజామలలో అత్యధికంగా 44.6డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కడపలోనూ 44డిగ్రీలకుపైగా రికార్డు కాగా, మరో మూడు రోజులూ ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

**నిప్పుల కొలిమిలా రాష్ట్రం**

ఏపీ, తెలంగాణలో ఎండలు భగ్గుమంటున్నాయి. ఉదయం 9గంటలకే వాతావరణం వేడెక్కుతోంది. దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ 35 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుండగా, ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమలో 44డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయ్యింది. ఈ క్రమంలో వాతావరణ శాఖ ఉత్తర కోస్తా జిల్లాలకు చల్లని కబురు అందించింది. మరో మూడు రోజుల్లో వాతావరణం చల్లబడుతుందని, అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడొచ్చని తెలిపింది.

**మరో మూడు రోజుల్లో**

ఉత్తర కోస్తాలో ఈ నెల 19 నుంచి 22 వరకు మూడు, నాలుగు రోజుల పాటు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని తెలిపింది. అప్పటి వరకు వాతావరణం పొడిగా ఉండే అవకాశం ఉంటుందని వెల్లడించింది.దక్షిణ కోస్తాలో వారం రోజుల పాటు వాతావరణంలో ఎలాంటి మార్పు ఉండబోదని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. వేడి, తేమ, అసౌకర్య వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది.రాయలసీమలో వడగాలులు వీచే అవకాశం ఉంటుందని, ఉష్ణోగ్రతలు మరో 2నుంచి 4డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ నెల 19 నుంచి 22 వరకు మూడు, నాలుగు రోజుల పాటు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని తెలిపింది. అప్పటి వరకు వాతావరణం పొడిగా ఉండే అవకాశం ఉంటుందని వెల్లడించింది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com